సాక్షి
విజయనగరం

శనివారం । 11 । మార్చి । 2023



సీతంరాజును గెలిపించండి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. - IIలో



ఆర్మ్‌డ్ పోలీసుల సమస్యల పరిష్కారానికే దర్బార్

పోలీసులు విధులు నిర్వహించేటప్పుడు నిష్పక్షపాతంగా, అంకితభావం, నిజాయితీతో వ్యవహరించి, ప్రజలకు మరింత చేరువ కావాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులకు సూచించారు. - IIలో



సాగుకు యంత్ర సాయం

పంటల సాగులో సాంకేతిక, యంత్ర పరిజ్ఞానాన్ని వినియోగించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ రైతులకు సూచించారు. - IIలో

న్యూస్‌రీల్

పోరాటయోధురాలు సావిత్రిబాయి పూలే



సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: సమసమాజం కోసం సామాజిక ఉద్యమం నడిపిన మహా పోరాట యోధురాలు సావిత్రిబాయి పూలే అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు అన్నారు. సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ కూడలి వద్దనున్న సావిత్రిబాయిపూలే విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.నాగభూషణం, పి. లక్ష్మారెడ్డి, శ్రీనివాసరెడ్డి, గువ్వల రవి, డి.వేణు తదితరులు పాల్గొన్నారు.

కె.పాలవలసకు జాతీయ అవార్డు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కె.పాలవలస పంచాయతీ తాగునీటి సరఫరా విభాగంలో జాతీయస్థాయి అవార్డుకు ఎంపికైంది. 2020-21 జాతీయస్థాయి పంచాయతీ అవార్డుకు సంబంధించి జిల్లా పంచాయతీ పెర్‌ఫార్మెన్స్ ఎసెస్‌మెంట్ కమిటీ కె.పాలవలస పంచాయతీని ఎంపిక చేసింది. పంచాయతీ వాసులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తాగునీరు సరఫరా చేస్తున్నందుకు 98 మార్కులతో అవార్డును ప్రకటించింది. ఏప్రిల్ 24న కలెక్టర్ చేతులమీదుగా జిల్లా పంచాయతీ కార్యాలయంలో అవార్డును అందుకుంటామని సర్పంచ్ మీసాల ప్రసాదరావు తెలిపారు.

కరాటేలో రాణించిన గరివిడి విద్యార్థిని



సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీడీ

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడి ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.సాయిలక్ష్మి కరాటేలో రాణించింది. అమరావతిలో ఈ నెల 7న జరిగిన ఏపీ స్టేట్ కరాటే ఓపెన్ కాంపిటీషన్‌లో అండర్-19 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ జి.ప్రసన్నలక్ష్మి, పీడీ ఎం.భానుమూర్తి అభినందించారు.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో అనధికారికంగా నడుపుతున్న డయాగ్నోస్టిక్ సెంటర్లు, ల్యాబ్స్, ఆస్పత్రులు, క్లినిక్‌లు, ఫిజియోథెరపీ, డెంటల్ క్లినిక్‌లు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం-2022ను అనుసరించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. స్కానింగ్ సెంటర్లు కూడా గర్భస్థ లింగనిర్ధారణ నిరోధక చట్టం-1994ను అనుసరించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సెంచూరియన్‌లో క్రీడా పోటీలు ప్రారంభం



పోటీల ప్రారంభోత్సవంలో మార్చ్‌పాస్ట్ చేస్తున్న క్రీడాకారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీలను వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎస్ రాజు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉల్లాసంగా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. ఈ నెల 13 వరకు అథ్లెటిక్ పోటీలతో పాటు ఖోఖో, బాస్కెట్‌బాల్, వాలీబాల్, త్రోబాల్, ఫుట్‌బాల్, క్రికెట్, కత్తిసాము తదితర పోటీలు జరుగుతాయని చెప్పారు. విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు

- ఉమ్మడి విజయనగరం జిల్లాలో 96 పోలింగ్ కేంద్రాలు
- ఓటు హక్కు వినియోగించుకోనున్న గ్రాడ్యుయేట్ ఓటర్లు 77,022 మంది
- 13న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు పోలింగ్



సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 13న పోలింగ్ సజావుగా జరిగేలా ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే ఓటర్లందరికీ బీఎల్‌ఓల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తిచేశారు. రెండు జిల్లాల ఎన్నికల యంత్రాంగం అందజేసిన ఓటరు స్లిప్పుల ఆధారంగా ఓటరు జాబితాలో ఓటర్ల పేరు గుర్తించేందుకు అవకాశం ఉంది. పోలింగ్ కేంద్రం సమీపంలో కూడా ఓటరు స్లిప్పులు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్లు ఇలా...

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 77,022 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. విజయనగరం జిల్లాలో 58,502 మంది, పార్వతీపురం మన్యం జిల్లాలో 18,502 మంది ఓటర్లు ఉన్నారు. వీరి కోసం విజయనగరం జిల్లా యంత్రాంగం 72, పార్వతీపురం మన్యం జిల్లా యంత్రాంగం 24 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. విజయనగరం జిల్లాలో మొత్తం ఓటర్లలో 38,625 మంది పురుషులు, 19,868 మంది మహిళా ఓటర్లు, 9 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. విజయనగరం డివిజన్‌లో అత్యధికంగా 33,643 ఓటర్లు ఉండగా చీపురుపల్లి డివిజన్‌లో 14,256 మంది, బొబ్బిలి డివిజన్‌లో 10,603 మంది ఓటర్లు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం 96 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. విజయనగరం డివిజన్‌లో 42, బొబ్బిలి డివిజన్‌లో 13, చీపురుపల్లి డివిజన్‌లో 17, పార్వతీపురం మన్యం జిల్లాలో 24 చొప్పున పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఒక్క విజయనగరం పట్టణంలోనే 20 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి.

ఎన్నికల సామగ్రి పంపిణీ

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం అవసరమైన సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు పంపిణీ చేసేందుకు, ఎన్నికల సిబ్బంది కేటాయింపు, తదితర పనులకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఏర్పాటు చేశారు. విజయనగరం డివిజన్‌కు ఆర్డీఓ కార్యాలయంలోనూ చీపురుపల్లికి సంబంధించి ఎస్‌డీఎస్ కళాశాల గరివిడిలోనూ, బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలోనూ ఎన్నికల సామగ్రి ఏర్పాట్లు చేశారు. మార్చి 12న ఉదయం 8 గంటల నుంచే సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు ఆర్టీసీ బస్సులను కూడా ఏర్పాటు చేశారు.

జోనల్, రూట్ అధికారుల నియామకం

విజయనగరం జిల్లాను 13 జోన్లుగా విభజించి 13 నుంచి జోనల్ అధికారులను నియమించారు. దీంతోపాటు 13 రూట్లుగా విభజించి 24 మంది రూట్ అధికారులను నియమించారు.

మైక్రో అబ్జర్వర్ల నియామకం

ఎన్నికలు సక్రమంగా సజావుగా జరిగేలా తగిన పర్యవేక్షణ చేసే నిమిత్తం ఎన్నికల సంఘం 96 మంది కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులను మైక్రో అబ్జర్వర్లగా నియమించింది. వీరికి అదనంగా 20 మంది రిజర్వు అబ్జర్వర్లను కూడా నియమించింది. పోలింగ్ తీరును గమనించి దీనిపై ఎన్నికల సంఘానికి వీరు నివేదికలు అందజేస్తారు. వీరికి ఇప్పటికే రెండు విడతల శిక్షణ పూర్తి చేశారు.

కలెక్టర్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్

పోలింగ్ రోజున ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళిని పరిశీలించేందుకు జిల్లా పరిషత్ సీఈఓ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతి రెండు గంటలకు నమోదైన ఓట్లను తెలుసుకోవడంతోపాటు ఆయా కేంద్రాల్లో పోలింగ్ జరుగుతున్న విధానం, ఎక్కడైనా శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమయ్యిందీ లేనిదీ వంటి సమస్యలు కూడా తెలుసుకుంటారు. జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచే ఎన్నికల పర్యవేక్షణ చేస్తారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఏర్పాటు చేసిన 96 పోలింగ్ కేంద్రాల్లోనూ ఓటర్లకు అవసరమైన కనీస వసతులు కల్పించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. తాగునీటి సదుపాయాలు, ప్రాథమిక వైద్య చికిత్స, ఓటర్లు నిల్చునేందుకు తగిన నీడ కల్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. అధిక సంఖ్యలో ఓటర్లు ఉండే కేంద్రాల్లో బారికేడ్లు వంటి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల సరళిని వర్చువల్‌గా పరిశీలించేందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. 96 కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలింగ్ జరుగుతున్న తీరును జిల్లా కేంద్రం నుంచి జిల్లా కలెక్టర్ తదితరులు పర్యవేక్షిస్తారు.

కలెక్టర్ కార్యాలయంలో రిసెప్షన్ సెంటర్

పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్సులు తరలించి భద్రపరిచేందుకు కలెక్టర్ కార్యాలయంలో రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. అన్ని ప్రాంతాల నుంచి బ్యాలెట్ బాక్సులు చేరిన తర్వాత వాటిని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచి ఇక్కడి నుంచి విశాఖకు తరలించే ఏర్పాట్లు చేస్తాం. స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటువేసే వాతావరణం కల్పిస్తున్నాం.

– ఎ.సూర్యకుమారి, విజయనగరం జిల్లా కలెక్టర్

బ్యాలెట్ బాక్సులు, పేపర్లు సిద్ధం

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం విజయనగరం జిల్లాకు 229 పెద్ద సైజు బ్యాలెట్‌లను ఎన్నికల సంఘం సరఫరా చేసింది. వీటికి అదనంగా మరో 100 రిజర్వు బ్యాలెట్ బాక్సులు కూడా సమకూర్చింది. ఎన్నికల పోలింగ్‌కు అవసరమైన బ్యాలెట్ పత్రాలను ఇప్పటికే జిల్లా కేంద్రానికి అధికారులు చేర్చారు. బ్యాలెట్ పత్రాల తనిఖీ కూడా జిల్లా స్థాయిలో పూర్తిచేసి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రంగా ఉంచారు.

పటిష్ట బందోబస్తు

- ఎన్నికల విధి నిర్వహణలో 1500 మంది పోలీసులు
- ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్లు ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం స్పష్టం చేశారు. జిల్లాలోని 31 ప్రాంతాల్లోని 72 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు అన్ని రకాల భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఎస్‌ఐ స్థాయి అధికారితో పాటు పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తారని చెప్పారు.



ఎం.దీపిక, ఎస్పీ, విజయనగరం

బందోబస్తుకు ఒక అదనపు ఎస్పీతో సహా ఐదుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 67 మంది ఎస్‌ఐలు, 90 మంది ఏఎస్‌ఐలు, 222 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 552 మంది కానిస్టేబుళ్లు, 106 మంది మహిళా కానిస్టేబుళ్లను నియమించామన్నారు. వీరితో పాటు ఆర్మ్‌డ్‌రిజర్వు, ఏపీఎస్పీ, ఎస్టీఎఫ్, హోమ్‌గార్డులతో సుమారు 1500 మంది విధులు నిర్వహిస్తారని చెప్పారు. 13 రూట్ మొబైల్స్, 18 స్ట్రైకింగ్ ఫోర్స్‌లు, ఆరు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను ఏర్పాటుచేశామన్నారు. జిల్లాలో ఆరు చెక్ పోస్టులను ఏర్పాటుచేసి, నిరంతరం వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. పోలింగ్‌కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సీఆర్‌పీసీ, సెక్షన్-30 పోలీస్ చట్టం అమల్లో ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఎటువంటి టెంట్‌లు వేయకుండా చూడాలని, రెవెన్యూ సిబ్బంది సహకారంతో లైన్లు ఏర్పాటుచేయాలని భద్రతా అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో చట్టంను ఎవరు ఉల్లంఘించినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

● వివాహ ఆహ్వానం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వివాహ ఆహ్వానపత్రికలను అందజేస్తున్న జెడ్పీచైర్మన్, నెల్లిమర్ల ఎమ్మెల్యే

విజయనగరం: తమ ఇంట జరుగుతున్న సిరిసహస్ర-ప్రదీప్‌ల వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బొడ్డుకొండ అప్పలనాయుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ఆహ్వానించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని శుక్రవారం కలిశారు. ఇరువురు వియ్యంకులు మజ్జి-బడ్డుకొండ వారి ఇంట ఈ నెల 23న జరిగే వివాహమహోత్సవానికి విచ్చేయాల్సిందిగా ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా కాబోయే నవదంపతులకు సీఎం శుభాభినందనలు తెలియజేశారు. సీఎంను కలిసిన వారిలో మక్కువ శ్రీనివాసరావు, భోగాపురం రఘుబాబు ఉన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- కలెక్టర్ సూర్యకుమారి



విజయనగరం అర్బన్: పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా జిల్లాలోని ఉపాధ్యాయులందరూ బోధన సాగించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. ప్రీ ఫైనల్ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులను విశ్లేషించుకొని ఫలితాలు మెరుగ్గావచ్చేలా చూడాలన్నారు. టీమ్ కాన్ఫరెన్స్ ద్వారా మోడల్ స్కూల్స్, కేజీబీవీ, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రిన్సిపాళ్లతో శుక్రవారం మాట్లాడారు. ప్రీ ఫైనల్ పరీక్షల్లో సబ్జెక్టుల వారీగా ఫెయిలైన వారు ఏ కారణంగా ఫెయిలయ్యారన్నదానిపై ఆరా తీశారు. ఏఏ సబ్జెక్ట్‌ల్లో వెనకబడి ఉన్నారో గుర్తించి ప్రత్యేక బోధన అందించాలన్నారు. సులభ పద్ధతుల్లో పాఠ్యాంశాలపై అవగాహన కల్పించాలని కోరారు. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా బోధన సాగించాలని సూచించారు. ఉన్నత చదువులు చదివే స్థోమత, సమర్థత లేని వారికి పాలిటెక్నిక్ కోర్సులకు దరఖాస్తు చేయించాలన్నారు. సమావేశంలో డీఈఓ లింగేశ్వరరెడ్డి, జిల్లా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్స్ కో ఆర్డినేటర్ చంద్రావతి పాల్గొన్నారు.

సుధాకర్‌ను గెలిపిద్దాం

- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషిచేయాలి
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

బొండపల్లి: ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ తరపున పోటీచేస్తున్న సీతంరాజుసుధాకర్‌ను గెలిపించాల్సిన బాధ్యత ప్రతి వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్యకర్తపైనా ఉందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గొట్లాం గ్రామంలోని సత్య ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అధ్యక్షతన నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్‌కు మరో రెండు రోజుల సమయమే ఉందని, గ్రామాల్లోని ప్రతి పట్టభద్రుడుని, ఉద్యోగిని కలిసి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, పారదర్శక పాలన వివరించి ఓట్లను అభ్యర్థించాలన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి సీఎం చేస్తున్న కృషి, విద్యార్థులకు కలగనున్న ఉద్యోగ భవిష్యత్‌ను వివరించాలన్నారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ వల్ల రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్లపెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. దీనివల్ల రాష్ట్రంలోని ఆరు లక్షలమంది యువతకు రాష్ట్రంలోనే ఉన్నత ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈగవర్నెన్స్‌లో ఏపీ దేశంలోనే 3,4 స్థానాల్లో ఉందన్నారు. గతంలో ప్రభుత్వ విద్యకు మొదట కేరళ రాష్ట్రాన్ని, తర్వాత ఢిల్లీని ఆదర్శంగా తీసుకునేవారని, ఇప్పుడు ఏపీను తీసుకుంటున్నారని, ఇది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న విద్యాసంస్కరణల ఫలితమని చెప్పారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలోని 26 జిల్లాల్లోనూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటుచేస్తున్న ఘనత ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పంటలు వేయక ముందే గిట్టుబాటు ధరను ప్రకటించి కొనుగోలు చేస్తోందని వివరించారు. గతంలో కనీసం మరుగుదొడ్లు లేని పాఠశాలలకు నాడు-నేడు ద్వారా సకలవసతులతో సర్వాంగ సుందర్భంగా తీర్చిదిద్దుతోందన్నారు. పేద కుటుంబాల పిల్లల చదువుకు పెద్దపీట వేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వ స్కూల్స్‌లో డిజిటల్ పాఠాలు

నాడు-నేడు పనులు పూర్తయిన పాఠశాలల విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి డిజిటల్ పాఠ్యాంశ బోధన సాగుతుందున్నారు. ప్రతీ పాఠశాలకు స్మార్ట్ టీవీలతో పాటు ప్లానర్స్‌ను ఏర్పాటు చేయాలని సీఎం ఇటీవల నిర్ణయించారన్నారు. విద్యార్థుల్లో రక్తహీనత సమస్యను నివారించేందుకు జగనన్న గోరుముద్దలో భాగంగా రాగిజావను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పి.వి.సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు), వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల యూత్ కోఆర్డినేటర్ అవనాపు విక్రమ్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎమ్‌సీ చైర్మన్ వేమలి ముత్యాలునాయుడు, వైస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.వి.ప్రభాజీ, ఎం.నారాయణమూర్తి రాజు, కొండపల్లి కొండలరావు, బొండపల్లి, గజపతినగరం, దత్తిరాజేరు, గంట్యాడ, జామి మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీలు, పార్టీ మండల కన్వీనర్లు చలంనాయుడు, బి.జ్ఞానదీపిక, జి.సింహాద్రి అప్పలనాయుడు, పి.హైమావతి, ఎస్.అరుణ, ఆర్.సూర్యప్రకాశరావు, జి.తవుడు, ఆర్.రాజేశ్వరి, వి.నర్సింహమూర్తి, జి.సరయు, ఇ.కృష్ణ, బి.వెంకటరావు, జి.రవికుమార్, బొండపల్లి వైస్ ఎంపీపీ ఎం.సరోజిని, గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ రమణ, ఎం.తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

● 19 బాటిల్స్ స్వాధీనం



మద్యం విక్రయిస్తున్న వ్యక్తితో పోలీసులు

గంట్యాడ: మండలంలోని కొత్త వెలగాడ గ్రామానికి చెందిన యవర్ల అప్పలనాయుడు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో పోలీసులు శుక్రవారం దాడి చేసి పట్టుకున్నారు. నిందితుడి దగ్గర నుంచి 19 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.2,470 ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

50 సారా ప్యాకెట్లతో మహిళ..

పాచిపెంట: మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ శుక్రవారం ఉదయం సారా అమ్ముతూ పట్టుబడింది. ఈ మేరకు ఆ మహిళ దగ్గరున్న 50 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసున మోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్సై ముసలయ్య తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం



ప్రమాదంలో కాలిబూడిదైన బట్టలు, ఇతర సామగ్రి

కొత్తవలస: మండలంలోని సాంబయ్యపాలెం గ్రామం శివారు రెల్లి కాలనీలో గల మేడిశెట్టి సత్తిబాబు శ్లాబ్ ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు రేగి అగ్నిప్రమాదం సంభవించింది. అయితే ఆ సమయంలో సత్తిబాబు తన వ్యక్తి గత పనిపై వేరే గ్రామం వెళ్లగా ఆయన భార్య రేవతి ఉపాధి పనులకు వెళ్లింది. ఇంట్లో ఒక్కసారిగా మంటలు రేగి పెద్ద ఎత్తున పొగ కమ్ముకోవడంతో స్థానికులు గమనించి మంటలను అదుపు చేశారు. అనంతరం ఇంటిలోకి వెళ్లి చూడగా మంచాలు.టీవీ, ఫ్రిజ్, ఇంటి అలంకరణ సామగ్రి కాలి బూడిదయాయి.ఈ ప్రమాదంలో సుమారు లక్ష రూపాయల వరకు ఆసినష్టం సంభవించిందని బాధితుడు సత్తిబాబు రోదించాడు. బాధితుడి కుటుంబాన్ని వైఎస్ఆర్‌సీపీ నాయకుడు మదీన అప్పల రమణ తదితరులు పరామర్శించారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరికి గాయాలు



పార్వతీపురం: చికిత్స పొందుతున్న సంతోష్‌కుమార్

పార్వతీపురం: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ మేరకు పార్వతీపురం అవుట్ పోస్టు పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీతానగరం మండలం లచ్చిరాజుపేటకు చెందిన ఎం.సంతోష్‌కుమార్ పార్వతీపురం మండలం బందులుప్పికి ద్విచక్రవాహనంపై వస్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు క్షతగాత్రుడిని చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి..

భోగాపురం: మండలంలోని సవరవల్లి గ్రామానికి చెందిన తాటిపల్లి రాము గురువారం రాత్రి జాతీయ రహదారి దాటుతుడగా శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని తగరపువలస ఎస్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

భారీ మెజార్టీతో సీతంరాజును గెలిపించండి

● సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ప్రచారం

● ప్రచారంలో పాల్గొన్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్సీ పెనుమత్స, అభ్యర్థి సీతంరాజు



మాట్లాడుతున్న సీతంరాజు సుధాకర్ చిత్రంలో ఎంపీ బెల్లాన, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



హాజరైన న్యాయవాదులు

విజయనగరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కోరారు. ఈ మేరకు శుక్రవారం న్యాయవాదుల సంఘం భవనంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా న్యాయవాదులంతా సీతంరాజు సుధాకర్‌కు మద్దతు తెలియజేసి చేసి మొదటి ప్రాధాన్యతను వేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధార్, ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్‌బాబు, న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సంజీవరావు, రాష్ట్ర బార్‌కౌన్సిల్ మాజీ చైర్మన్ కోలగట్ల తమ్మన్నశెట్టిలు అభ్యర్థించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని గుర్తు చేశారు. జిల్లా కోర్టు నూతన భవన నిర్మాణానికి మంత్రి బొత్స, ఎంపీతో కలిసి నిధుల మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. జిల్లాలోని న్యాయవాదులతో తనకు సత్సంబంధాలు ఉన్నాయని, న్యాయవాదులంతా సుధాకర్‌కు అండగా నిలవాలని అభ్యర్థించారు.

ఓర్వలేనితనంతో దుష్ప్రచారం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిపై పచ్చమీడియా దుష్ప్రచారం దురదృష్టకరమని పేర్కొన్నారు. విశాఖలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావటంతో ఓర్వలేని తనంతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని విజ్ఞానవంతులైన పట్టభద్రులంతా గమనించాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదని దుష్ప్రచారం చేయడం తగదన్నారు. కోవిడ్ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక పరిస్థితులను గమనించడంతో పాటు అదే సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమాన్ని అర్థం చేసుకోవాలని చెప్పారు.

గ్రామ స్వరాజ్య స్థాపన

ఏపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం న్యాయవాదుల సమస్యలను అర్థం చేసుకుని లా నేస్తం ద్వారా ఆదుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం గ్రామ సచివాలయలను ఏర్పాటు చేశారని, తద్వారా మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం స్థాపించారన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలు జరుగుతుందన్నారు. విజ్ఞులైన న్యాయవాదులంతా తమ మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ప్రతినిధులు చుక్కా భాస్కరరావు, ఎర్రోతు హరికృష్ణ, మర్రి రవికుమార్, కోనా చినఅప్పరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తం

● డీఎంహెచ్ఓ డాక్టర్ రమణకుమారి



డీఎంహెచ్ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బకు గురయ్యే ఆస్కారం ఉందని అందరూ అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. తలనొప్పి, తలతిరగడం, తీవ్రమైన జ్వరం కలిగి ఉండడం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్ లేదా పూర్తి అపస్మారక స్థితి వడదెబ్బ లక్షణాలని తెలిపారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి ఆమె తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి.

ఎండతీవ్రంగా ఉన్నప్పుడు..

- తెలుపు రంగు పలుచటి కాటన్ వస్త్రాలు ధరించాలి
- తలకు టోపీ లేదా తలపాగా, గొడుగు ధరించాలి
- ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరి బొండాం, ఓఆర్ఎస్ కలిపిని నీటిని నీటిని తప్పక తాగాలి వీలైనంత వరకు బయటకు వెళ్లినప్పుడు వెంట మంచి నీరు తీసుకెళ్లాలి
- ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు కచ్చితంగా ఒక గ్లాసు మంచి నీరు తాగాలి ముఖ్యంగా గర్భిణులు, చిన్న పిల్లలకు ఎండవేడిమి తగలకుండా చూసుకోవాలి

వడదెబ్బకు గురైనప్పుడు..

వడదెబ్బకు గురైన వారిని నీడగా ఉన్న చల్లని ప్రాంతానికి, గాలి బాగా తగిలే ప్రదేశానికి వెంటనే చేర్చాలి. వడదెబ్బకు గురైన వారిని తడి గుడ్డతో శరీరమంతా తుడుస్తూ ఉండాలి. దుస్తులు వదులుగా చేయాలి. వడదెబ్బకు గురైన వారు సాధారణ స్థితికి రాకపోతే దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తీసుకువెళ్లాలి.

ఎండ బారిన పడకుండా..

సూర్యకిరణాలు, వేడి గాలికి గురికాకూడదు. నలుపు రంగు, మందంగా ఉండే దుస్తులు ధరించరాదు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య కాలంలో ఆరుబయట తిరగడం, ఎక్కువ శారీరక శ్రమతో కూడిన పనులు చేయరాదు. ఎండలో తిరిగి బయట నుంచి వచ్చిన వెంటనే తీపి పదార్థాలు తీసుకోరాదు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



దంగభద్ర పంట పొలాల్లో లభ్యమైన మృతదేహం

జియ్యమ్మవలస: మండలంలోని దంగభద్ర గ్రామ శివారు పొలాల వద్ద శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని మృతదేహం పడి ఉందని ఎస్సై అనీష్ తెలిపారు. మృతునికి 60 సంవత్సరాలుంటాయని, వివరాలు తెలిసిన వారు తమకు తెలియజేయాలని కోరారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తించినట్లయితే ఫోన్ 9121109479 నంబర్‌కు సమాచారం అందజేయాలని ఎస్సై అనీష్ చెప్పారు.

రైలుకిందపడి యువతి ఆత్మహత్య





మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్సై శ్రీనివాస్, జామి ఎస్సై వీరబాబు (ఇన్‌సెట్లో) జగదీశ్వరి-(ఫైల్)

జామి: మండలంలోని కొత్త భీమసింగి గ్రామానికి చెందిన బి.జగదీశ్వరి(22) వేధింపులు తాళలేక రైలు కిందపడి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వెన్నె గ్రామానికి చెందిన చిన్ని కోటబాబు అనే వ్యక్తి భీమసింగిలో సెల్‌ఫోన్ షాపు నిర్వహిస్తున్నాడు. కోటబాబుతో జగదీశ్వరికి పరిచయముండేది. అయితే ఇటీవల కోటబాబు జగదీశ్వరిని వేధింపులకు గురిచేస్తూ ఆమె ఫొటోలు, ఆడియో రికార్డింగ్‌లు కుటుంబసభ్యులకు పంపించాడు. దీంతో మనస్తాపానికి గురైన జగదీశ్వరి శుక్రవారం భీమసింగి రైల్వే గేటు వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న రైల్వే ఎస్సై సీహెచ్ఎల్.ఎన్ శ్రీనివాస్, జామి ఎస్సై వీరబాబు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. ఈ ఘటనపై కేసున మోదు చేసి విచారణ చేపడతామని తెలియజేశారు.

కుటుంబసభ్యుల రోదన

మృతురాలికి తల్లి వరలక్ష్మి, ఇద్దరు అక్కలు ఉన్నారు. జగదీశ్వరి బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి ఇంతలోనే మృతిచెందిన వార్త తెలిసిందని కుటుంబసభ్యులు భోరున విలపించారు. కోటబాబు వేధిస్తున్నాడని గురువారం రాత్రే తమకు చెప్పిందని రోదించారు.వేధింపుల వల్లనే తన కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని తల్లి వాపోయింది.

రెండు బైక్‌ల ఢీ: ఒకరి మృతి



ప్రమాదంలో మృతిచెందిన అప్పల నాయుడు

వేపాడ: మండలంలోని సంజీవమెట్ట సమీపంలో బుధవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి వల్లంపూడి పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం, సంజీవపురం గ్రామానికి చెందిన కొటాన అప్పలనాయుడు, ద్వారపూడినాయుడులు బైక్‌పై దేవరాపల్లి నుంచి వస్తుండగా గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఎదురుగా ఓ ద్విచక్రవాహన చోదకుడు నిర్లక్ష్యంగా వచ్చి వారి బైక్‌ను ఢీకొట్టాడు, దీంతో వారిద్దరూ గాయాల పాలవడంతో స్థానికులు 108వాహనం సమాచారం ఇవ్వగా వాహనం వచ్చి క్షతగాత్రులను కె.కోటపాడు ఆస్పత్రికి తరలించింది. వైద్యులు తనిఖీచేసి కొటాన అప్పలనాయుడు(48) మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు వల్లంపూడి ఎస్సై రాజేష్ శుక్రవారం కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారుకుడైన వాహనచోదకుడు పరారీలో ఉన్నాడు. రెండు బైక్‌లు స్వా.దీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎల్.కోట వైస్ ఎంపీపీ మృతి



దండేకర్ కుమారి (ఫైల్)

లక్కవరపుకోట: ఎల్‌కోట వైస్ ఎంపీపీ దండేకర్ కుమారి (32) శుక్రవారం తెల్లవాజూమున మృతి చెందారు. ఆమె కొద్ది రోజులుగా పచ్చకామెర్లతో బాధపడుతుండడంతో రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. దీంతో ఎస్.కోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా కుమారి 2021వ సంవత్సరంలో జరిగిన ప్రాదేశిక ఎన్నికల్లో లక్కవరపుకోట సెగ్మెంట్ నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీటీసీగా గెలుపొందారు. తరువాత జరిగిన అనుహ్యాపరిణామాల నేపథ్యంలో ఆమెను వైఎస్ ఎంపీపీ పదవి వరించింది. మృతురాలికి భర్త,ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె మృతి పట్ల ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, పలువురు ఎంపీటీసీలు కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

స్టేట్ బ్యాంక్‌లో చోరీకి విఫలయత్నం

కొత్తవలస : మండల కేంద్రంలోని జంక్షన్‌లో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో గురువారం అర్ధరాత్రి చోరీకి విఫలయత్నం చేశారు. ఈ ఘటనపై సీఐ ఎస్.బాలసూర్యారావు, బ్యాంక్ ఇన్‌చార్జ్ మేనేజర్ బి.దివ్య అందించిన వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి 12 గంటల ప్రాంతంలో బ్యాంక్‌కు ముందు ఉన్న ఇనుప షట్టర్‌ల తాళం కప్పల్లో మూడింటిని విరగ్గొట్టారు. అనంతరం రెండో షట్టర్‌కు గల ఒక తాళం కప్పను విరగొట్టారు. మరొకటి విరగ్గొట్టేందుకు ప్రయత్నించగా వీలు పడకపోవడంతో ప్రయత్నం మానుకున్నారు. ఎప్పటి మాదిరిగా బ్యాంక్ సిబ్బంది శుక్రవారం ఉదయం బ్యాంక్‌కు వచ్చే సరికి తాళాలు పగలు గొట్టి ఉండడం గమనించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే సీఐ బాలసూర్యారావు సిబ్బందితో వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బ్యాంక్‌కు గల ప్రధాన ఇనుప షట్టర్ తెరవక పోవడంతో బ్యాంకులో ఎటువంటి దొంగతనం జరగలేదని నిర్ధారించుకున్నారు. విజయనగరం నుంచి క్లూస్ టీమ్ సిబ్బంది వచ్చి అగంతుకుల వేలి ముద్రలను, తాళాలు పగుల గొట్టే విధానం పరిశీలించి ఆధారాలు సేకరించింది. అనంతరం యథావిధిగా బ్యాంక్‌ను ఓపెన్ చేసి లావాదేవీలను నిర్వహించారు. బ్యాంక్ ఇన్‌చార్జ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్మ్‌డ్ పోలీసుల సమస్యల పరిష్కారానికే దర్బార్

● పునశ్చరణ తరగతులు ముగింపు సభలో ఎస్పీ దీపిక



ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు సూచనలు చేస్తున్న ఎస్పీ ఎం.దీపిక



హాజరైన పోలీసు అధికారులు, సిబ్బంది

విజయనగరం క్రైమ్: పోలీసు విధులు నిర్వహించేటప్పుడు నిష్పక్షపాతంగా, అంకితభావం, నిజాయితీతో వ్యవహరించి, ప్రజలకు మరింత చేరువ కావాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులకు సూచించారు. జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులకు ప్రతి ఏటా 15 రోజుల పాటు నిర్వహించే పునశ్చరణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విధుల్లో మరింత నైపుణ్యం సాధించేందుకు ఈ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రస్తుత పరిస్థితులు, అవసరాల దృష్ట్యా ఆర్మ్‌డ్ పోలీసులకు వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితులను మెరుగుపర్చేందుకు ప్రణాళికాయుతంగా రూపకల్పన చేశామని తెలిపారు. ఈ సందర్భంగా పోలీసుల సమస్యలను తెలుసుకునేందుకు దర్బార్ నిర్వహించగా పలువురు వారి సమస్యలను వివరించారు. వాటికి వెంటనే అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపట్టడంతో హర్షం వ్యక్తం చేశారు.

ఎస్పీ భరోసా

పోలీసు ఉద్యోగుల కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఇచ్చే రుణాలపై వడ్డీని మరింత తగ్గిస్తాం. పార్వతీపురం మన్యం జిల్లాలో విధులు నిర్వహించే సిబ్బందికి ఏఎస్ఎస్ మంజూరుచేస్తాం. సిబ్బంది కొరతను సమీక్షించి వీక్లీ ఆఫ్ అమలుచేస్తాం. అనారోగ్య కారణాలతో విధులు నిర్వహించే సిబ్బందిని సరళమైన విధులకు వినియోగిస్తాం. ఇతర ప్రాంతాలకు విధి నిర్వహణ నిమిత్తం వెళ్లే సిబ్బందికి వాహన సదుపాయం కల్పిస్తాం. వెయిటింగ్‌లో ఉండే పోలీసు సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు ప్రత్యేక విశ్రాంత గదులు, సదుపాయాలు కల్పిస్తాం. చాలాకాలంగా వివిధ డ్యూటీల్లో డిప్యుటేషన్‌పై పని చేస్తున్న సిబ్బంది స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించేందుకు చర్యలు చేపడతామని ఈ సందర్భంగా ఎస్పీ భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు, ఆర్ఐ బి.రమణమూర్తి, ఎస్బీ సీఐలు జి.రాంబాబు, సీహెచ్.రుద్రశేఖర్, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, టూటౌన్ సీఐ సీహెచ్.లక్ష్మణరావు, ఆర్ఎస్సైలు శ్రీనివాసరావు, నీలిమ, నారాయణరావు, ప్రసాదరావు, కేశవరావు, విజయకుమార్, ఏఆర్ ఎస్సైలు, హెచ్‌సీలు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150–00
బంగారం(22సి. 10గ్రా.)	51,800–00
వెండి (కిలో)	71,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹100	₹170	₹ 180

సాగుకు యంత్ర సాయం

● జేసీ మయూర్ అశోక్



డ్రోన్‌ను పరిశీలిస్తున్న జేసీ మయూర్‌అశోక్

విజయనగరం ఫోర్ట్: పంటల సాగులో సాంకేతిక, యంత్ర పరిజ్ఞానాన్ని వినియోగించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ రైతులకు సూచించారు. మారుతీ కంపెనీ తయారు చేసిన వ్యవసాయ డ్రోన్ ఏజీ365 అగ్రికాప్టర్‌పై గాజులరేగ వ్యవసాయ పరిశోధనా స్థానంలో నాబార్డు ఆధ్వర్యంలో శుక్రవారం వర్క్‌షాపు నిర్వహించారు. కంపెనీ ప్రతినిధులు డ్రోన్‌సాయంతో పంటలకు పురుగుమందుల పిచికారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ రైతులు సంఘాలుగా ఏర్పడితే వ్యవసాయ యంత్రాలను రాయితీపై పొందవచ్చన్నారు. ప్రాసెసింగ్ యూనిట్లను సొంతంగా నిర్వహించి పంటలను గిట్టుబాటు ధరకు విక్రయించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. యాంత్రిక వ్యవసాయంతో పెట్టుబడి తగ్గుతుందన్నారు. మండలానికి మూడు డ్రోన్‌లను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయఅధికారి వి.తారకరామారావు, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి, నాబార్డు డీజీఎం నాగార్జున, వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి నర్సుపల్లి అనూరాధ, కెల్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత ప్రాతిపదికన అధ్యాపకుల పోస్టుల భర్తీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

గజపతినగరం: గజపతినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శాశ్వత ప్రాతిపదికన అధ్యాపకుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని కళాశాల ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. మంత్రి బొత్స సత్యనారాయణ, ఎమ్మెల్యే బొత్సఅప్పలనరసయ్య కృషితో 23 మంది అధ్యాపక పోస్టులు భర్తీకానున్నాయన్నారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులందరూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరారు. బీఏ, బీకాం జనరల్, బీకామ్ కంప్యూటర్స్, సీబీజెడ్, బీఎస్‌ఈ ఎంపీసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రమాణాలతో కూడిన విద్యాబోధన సాగిస్తామని చెప్పారు.